రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** తాండూరు సెగ్మెంట్‌లో సుమారు 1500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శాసనసభ్యుడు బి.మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆమెరికా నుంచి ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రూ.623 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం యేడాదిలోగా దాదాపు పూర్తవుతుందని తెలిపారు. రూ.190 కోట్లతో పంచాయత్‌రాజ్ రహదారులు, లింక్ రోడ్ల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. తాండూరు బైపాస్ రోడ్డుకు ఇటీవల రూ.25 కోట్లు మంజూరు చేయించామని, రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. రూ.86.6 కోట్లతో కోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తి కావచ్చాయని గుర్తు చేశారు. కోటపల్లి ప్రాజెక్టు వల్ల పెద్దేముల్ మండల రైతాంగానికి మేలు జరుగుతుందని తెలిపారు. రూ.21 కోట్ల ఎస్‌డీఎఫ్, రూ.23 కోట్ల డీఎంఎఫ్‌టీ, రూ.46 కోట్లతో చిలుకవాగు నిర్మాణం, రూ.20 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, రూ.83 కోట్లతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పనులు, రూ.200 కోట్లతో ఇంటిగ్రెడెడ్ స్కూలు నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. రూ.27 కోట్లతో ఎన్టీఆర్ కాలనీ, ఓల్డ్ మున్సిపల్ ఆఫీసు, రాజీవ్‌కాలనీలలో వాటర్‌ట్యాంకులు నిర్మించామని తెలిపారు. రానున్న రెండేళ్లలో తాండూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వివరించారు.



అమెరికాలో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



నుదిటిపై బిఆర్ఎస్ అక్షరాలు రాసుకుని విన్యాసాలు చేస్తున్న పోతురాజు

# పోతురాజుకు బిఆర్ఎస్ మార్క్!

### నుదుట పవిత్ర తిలకం స్థానంలో ఏకంగా పార్టీ పేరు

### వేషధారణపై భగ్గుమన్న సంగెం భక్తజనం

### బోనాల జాతరలో రాజకీయ రచ్చపై నిరసన

**కేశంపేట ఆగస్టు 5 ప్రభాతవార్త :** ఆధ్యాత్మికత వెల్లివిరియాల్సిన బోనాల పండుగలో రాజకీయ ప్రచార రచ్చ మొదలైంది. కేశంపేట మండలం సంగెం గ్రామంలో గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న వేళ.. ఓ పోతురాజు వేషధారణ ఊహించని వివాదానికి తెరలేపింది. నుదుట దిద్దాల్సిన పవిత్ర తిలకం స్థానంలో ఏకంగా ఓ పార్టీ పేరును రాయడంతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పవిత్రమైన జానపద సంప్రదాయానికి రాజకీయ రంగు పులమడం ఏంటని గ్రామస్తులు, పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలలోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పోతురాజు వేషధారణ భక్తులు, గ్రామస్తుల మధ్య చర్చనీయాంశంగా మారింది. పోతురాజు వేషం ధరించిన వ్యక్తి తన నుదుటిపై సంప్రదాయబద్ధంగా పెట్టుకోవాల్సిన బొట్టుకు బదులుగా బీఆర్ఎస్ అని రాసుకోవడం కలకలం రేపింది. ఇది చూసిన భక్తులు, గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగు జానపద సంస్కృతి ప్రకారం, గ్రామదేవతలైన మహంకాళి, ఎల్లమ్మ, పోచమ్మలకు పోతురాజును సోదరుడిగా, గ్రామ రక్షకుడిగా, శివుని అంశగా భావిస్తూ అత్యంత పవిత్రంగా పూజిస్తారు. అలాంటి దైవస్వరూపానికి రాజకీయ పార్టీ పేరును జోడించడం సంప్రదాయాలను కించపరచడమేనని పలువురు భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఊరంతా కలిసి జరుపుకునే పవిత్రమైన బోనాల పండుగను రాజకీయ ప్రచార వేదికగా మార్చడం ఎంతమాత్రం సరికాదని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని దెబ్బతీస్తాయని, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి పనులకు పాల్పడకూడదని హితవు పలికారు. ఉత్సవాల పవిత్రతను, సాంప్రదాయ విలువలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి బాధ్యతారాహిత్య చర్యలను మనుషులు క్షమించినా, ఆ దేవుడు క్షమించడని, దీని ప్రతిఫలం తీవ్రంగా ఉంటుందని పలువురు భక్తులు హెచ్చరించారు.

# గురుకులంలో వేధింపుల కలకలం



ఆత్మహత్యకు ప్రయత్నించిన విద్యార్థి తారక్ తేజ





గురుకుల పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు

★ హాస్టల్‌లో ఉండలేనంటూ టెన్త్ విద్యార్థి ఆవేదన ★ టీసీ ఇవ్వాలని వేడుకున్నా పట్టించుకోని సిబ్బంది ★ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం ★ వికారాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన ఉపాధ్యాయులు ★ నిలకడగా బాధితుడి ఆరోగ్య పరిస్థితి ★ విద్యార్థుల వేధింపులు తాళలేకే అఘాయిత్యం: బంధువుల ఆరోపణ ★ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : బాధిత విద్యార్థి తండ్రి డిమాండ్

**కుల్కచర్ల, ఆగస్టు 5, ప్రభాతవార్త:** హాస్టల్లో ఉండటం ఇష్టం లేక విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో తారక్ తేజ పదవ తరగతి చదువుతున్నాడు. మంగళ వారం ఇంటినుండి తెచ్చుకున్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొద్దిసేపటికి గమనించిన ఉపాధ్యాయులు బాధిత విద్యార్థిని మొదటగా కుల్కచర్ల ప్రాథమిక పాఠశాలకు అనంతరం పరిగికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ఒక ప్రవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తారక్ ఆరోగ్య పరిస్థితి నలికడగా ఉందని తెలిపారు. విద్యార్థి స్వగ్రామం కుల్చర్ల కుంట తండా, షాద్‌నగర్ మండలం కుల్కచర్ల మండలం, బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. గత కొన్నిరోజులుగా తాను హాస్టల్లో ఉండనని, టీసీ ఇవ్వాలని సిబ్బందిని వేడుకుంటున్నాడు. కానీ తండ్రి శ్రీను సూచనల మేరకు టీసీ ఇవ్వలేదని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ క్రమంలో సోమవారం షాద్‌నగర్ దగ్గరలోని కుల్చర్ల కుంట తండాకు వెళ్ళివచ్చిన విద్యార్థి తన వెంట పురుగులమందును తెచ్చుకున్నటు ఉపాధ్యాయులు వివరించారు.

**పాఠశాల ముందు కుటుంబ సభ్యుల ఆందోళన..**

తమ కుమారుడు తోటి విద్యార్థుల యొక్క వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని కుటుంబ సభ్యులు బుధవారం గురుకుల పాఠశాల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడికి చేరుకున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల నిర్లక్ష ్యం వలనే విద్యార్థి ఈ ఘాతుకానికి ఒడికట్టాడని మండి పడ్డారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని పాఠశాల ముందు నిరసన తెలిపారు.

**ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణం : విద్యార్థి తండ్రి శీను నిరసన**

తమ కుమారుడి ఆత్మహత్యాయత్నానికి తోటి విద్యార్థుల మానసిక వేధింపులే కారణమని, గురుకులంలో ఇంత జరుగుతున్నా పట్టించుకోని ప్రిన్సిపాల్ లక్ష్మీ ్మకాంత్ రెడ్డిని సస్పెండ్ చేయాలని బాధిత విద్యార్థి తారక్ తండ్రి శ్రీను డిమాండ్ చేశారు.

## 52వేల మందికి ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలు

2లో

## భూమి ఇచ్చిన రైతులకు భరోసా..

### 553 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు

### 501 మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరు

### కొడంగల్ పారిశ్రామికాభివృద్ధికి మరో ముందడుగు

### రేడియల్ రోడ్డుకు సహకరించాలని కలెక్టర్ పిలుపు



పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

**దుద్యాల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** అభివృద్ధి కోసం భూమి ఇచ్చిన రైతు నష్టపోకూడదు అనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా టీజీఐఐసీ ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాల పట్టాలు అందజేశారు. లగచెర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలతో పాటు రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాకు చెందిన అర్హులైన 553 మంది భూనిర్వాసిత రైతులకు ఇంటి స్థలాల పట్టాలు, 501 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు బుధవారం కొడంగల్‌లోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామికా భివృద్ధితో పాటు భూములు కోల్పోయిన రైతుల పునరా వాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోం దన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్యాకేజీని పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి రైతుకు ఇంటి స్థలాల పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్లాట్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తూ 432 మంది లబ్ధిదారులకు డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా, 121 మందికి నేరుగా ప్లాట్లు కేటాయించామని తెలిపారు. మొత్తం 77 సార్లు డ్రా నిర్వహించి 553 మందికి ఇంటి స్థలాలు కేటాయించినట్లు వెల్లడించారు.

అందరి సహకారంతో 230 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటవుతోందని, త్వరలో ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇప్పటికే 501 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు కూడా అందజేశామని చెప్పారు.

హైదరాబాద్-కొడంగల్ రేడియల్ రోడ్ నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరిన కలెక్టర్, ఈ రహదారి పూర్తయితే కొడంగల్ పారిశ్రామికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. పరిగి డిఎస్పి శ్రీనివాస్, దుద్యాల్ ఎస్సై శ్రీశైలంతో పాటు పలువురు డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

## ఏ అవసరం ఉన్నా రండి

✦రాజకీయంగా ఎవ్వరినీ ఇబ్బంది పెట్టను ✦నాది పార్టీ రహిత పదవి ✦ఎవరు వచ్చినా పనిచేసిపెడతా ✦శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపు

**కోట్‌పల్లి, ఆగస్టు,5 ప్రభాతవార్త:** గ్రామాలలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి మండల స్థాయి సమీక్ష సమావేశాలు నలభై అయిదు రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధ వారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని బుగ్గాపూర్ రైతువేదికలో సర్వసభ సమావేశానికి అయన హజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం తెలియజేసిన >>2

## అక్కడ వారం నుంచి చెత్త వాహనాలు బంద్!

### కొత్తూరు మున్సిపాల్టీలో పడకేసిన పారిశుధ్యం

### డ్రైనేజీలు పొంగుతున్నా పట్టించుకోని అధికారులు

### పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు

**కొత్తూరు ఆగస్టు 5, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శన మిస్తుండగా.. మరోవైపు డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పలు కాలనీలు డంపింగ్ యార్డులను తలపి స్తున్నాయి. చెత్త సేకరణకు వాహనాలు రాక.. మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ కాలనీలో గత వారం రోజులుగా చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే చెత్త రోడ్లపైనే పేరుకుపోతోంది. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త కుప్పల చుట్టూ దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండటంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇక రైల్వే స్టేషన్ రోడ్డులో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన నెలకొంటోంది.

**స్పెషల్ డ్రైవ్‌లు ఎక్కడ?**

మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటికప్పుడు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రజలు అంటున్నారు. గతంలో జీవీపీ (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు) తొలగించామని ప్రకటించినా.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు యథావిధిగా దర్శనమిస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణంలో పారిశుధ్య లోపాల కారణంగా దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు



యుపిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

## సమర్థవంతంగా ఓపిడి సేవలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని సుభాష్‌నగర్‌లోని యుపి హెచ్‌సిని (ఆరోగ్యకేంద్రం) మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.ఆనంద్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. బుధ వారం మేడ్చల్ జిల్లాలోని సుభాష్‌నగర్ యుపిహెచ్‌సిని ఆయన సందర్శించి తనిఖీలు చేశారు. ఆసుపత్రిలో అందుతున్న ఆరోగ్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఓపిడి, గర్భిణీ స్త్రీల రిజిష్టర్లు, ఎన్‌సిడి రికార్డులను ఆయన తనిఖీలు చేశారు. రోగులకు అందిస్తున్న సేవలపై ఆయన సమీక్షించారు. ఫార్మసినీ తనిఖీ చేసి అత్యవసర మందుల నిల్వలు, ఔషదాల లభ్యత, సమీప కాలంలో గడువు ముగిసిన మందులను పరిశీలించారు. గడువు ముగిసేలోపు ఆయా మందులను నిబంధనల ప్రకారం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# చావులోనూ అన్నంపల్లికి ఆవేదనే!

### ఉప్పొంగే వాగు దాటితేనే అంతిమ సంస్కారాలు

### వారధి లేక కన్నీళ్లు పెడుతున్న గ్రామస్తులు

### శాశ్వత కల్వర్టు నిర్మించే వరకు కనీస సౌకర్యం కల్పించాలని డిమాండ్

### ఓట్లప్పుడు వచ్చే నాయకులు, సమస్యలొస్తే చిన్నచూపు చూస్తున్నారని రైతుల ఆగ్రహం

**పెద్దేముల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఎంతమంది పాలకులు మారుతున్నా మారుమూల గ్రామాల ప్రజల తలరాతలు మారడం లేదు శివారు పల్లెలను సైతం పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఇందుకు పెద్దేముల్ మండల తింసాన్‌పల్లి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

**పంచాయతీగా మారినా మారని తల రాత**

దాదాపు ఏడాదిన్నర క్రితం వరకు గోపాలపూర్ మేజర్ పంచాయతీకి శివారు గ్రామంగా ఉన్న తింసాన్పల్లి, ఆ తర్వాత మైనర్ పంచాయతీ హోదా సంతరించుకుంది. హోదా పెరగడంతో తమ కష్టాలు కొన్నైనా గట్టెక్కుతాయని స్థానికులు ఆశపడ్డారు. కానీ నిధుల కొరత, అధికారులు మరియు ప్రజాప్రతినిధుల చిన్నచూపు కారణంగా గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే మూలుగుతున్నాయి.

గ్రామంలో కనీసం ఎవరైనా మృతిచెందితే అంతిమ సంస్కారం చేయాలన్నా సరైన దారి లేదు. ఎస్సీ శ్మశాన వాటికకు చేరుకోవాలంటే తింసాన్పల్లి వాగు దాటాల్సిందే. వర్షాకాలంలో ఇందోలు చెరువు, ఓయాగు, బిందెల్లి వాగుల నుంచి వచ్చే వరద నీరంతా తింసాన్పల్లి వాగులోకి వచ్చి చేరుతుంది. ఇది ఆ తర్వాత బుద్దారం వాగులో విలీనం అవుతుంది.

**నడుములోతు నీటిలో పాడె మోత**

వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల మృతదేహాలను తీసుకెళ్లడం అత్యంత ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు నీటితో నిండిపోవడంతో, అంత్యక్రియల కోసం వచ్చిన బంధువులు, గ్రామస్థులు నడుములోతు నీటిలో పాడెను భుజాన ఎత్తుకుని వాగు దాటవలసిన దుస్థితి నెలకొంది.

**వ్యవసాయ అవసరాలకూ తప్పని తిప్పలు**

వాగుకు అవతల దాదాపు 200 ఎకరాల పంట భూములు ఉన్నాయి. వ్యవసాయ పనుల కోసం వెళ్లాలన్నా లేదా పండించిన దిగుబడులను బయటకు తరలించాలన్నా రైతులు అష్టకష్టాలు పడాల్సివస్తోంది. వాగుపై కనీసం ఒక కల్వర్టు అయినా నిర్మిస్తే ఈ నీళ్లలోంచి వెళ్లే తిప్పలు తప్పుతాయని స్థానికులు ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఓట్లప్పుడు వచ్చే నాయకులు, సమస్యలొస్తే చిన్నచూపు చూస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

**పంచాయతీకి ఆర్థిక స్థోమత లేదు : సర్పంచ్**

కల్వర్టు నిర్మాణం కోసం దాదాపు రూ. 25 లక్షలు ఖర్చు అవుతుందని, ఎలాంటి ఆదాయం లేని తమ మైనర్ పంచాయతీకి అంత ఖర్చు భరించే స్థోమత లేదని సర్పంచ్ తన అశక్తతను వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు మానవత్వంతో అర్థం చేసుకుని తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. శాశ్వత వారధి నిర్మించే వరకు, ఈ వర్షాకాలం గట్టెక్కడానికి తాత్కాలిక సౌకర్యమైనా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.





కనీస వసతులు లేని ఆమనగల్లు శ్మశాన వాటిక

## ఆరుబయటే అంతా..

### వానలోనే దహన సంస్కారం

### నీటి వసతి లేక స్నానాల గదులు నిరుపయోగం

### ఆమనగల్లు శ్మశాన వాటికలో సవాలక్ష సమస్యలు

**ఆమనగల్లు, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని ప్రధాన శ్మశాన వాటికలో కనీస వసతులు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తరబడి ఆఖరి మజిలీలో తిష్ట వేసిన సమస్యలు అవేదనకు గురి చేస్తున్నాయి. ఆచారాల ప్రకారం కొంతమంది బొందలు, మరి కొందరు దహన సంస్కారం చేస్తుంటారు. అయితే ఆమనగల్లు శ్మశాన వాటికలో దహన సంస్కారం చేసేందుకు ప్రత్యేక షెడ్డు లేదు. ఎక్కడా ఖాళీ జాగా ఉంటే అక్కడే కార్యక్రమం కానిచ్చేయ్యాల్సి వస్తోంది. వర్షం పడితే బురద నేలమీద తడిసిన కట్టెలతోనే దహన సస్కారానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. ముళ్ల పొదలు అల్లుకుపోవడంతో కనీసం నిలబడలేని స్థితిలో అంతిమ వీడ్కోలు పలుకుతున్నారు. అంత్యక్రియల అనంతరం స్నానాలు చేయడానికి నీటి వసతి లేదు. ప్రత్యేక నీటి ట్యాంకర్ల మీదనే ఆధారపడవలిసి వస్తోంది. దాతల సహకారంతో స్నానాల గది నిర్మించినా నీటి వసతి లేకపోవ డంతో నిరుపయోగంగా మారింది. విద్యుత్ సౌకర్యం లేక అంధకారం రాజ్యమేలుతోంది. విషపురుగులు సంచార ంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఎండాకాలంలో నీడ కోసం చెట్లను వెతుక్కోవాల్సిందే. దహనం చేసేందుకు ప్రత్యేక షెడ్డు నిర్మించి సౌకర్యాలు ఏర్పాటు చేయటానికి మున్సిపాలిటీ నిధులు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



తల్లిపాల వారోత్సవాలు

## పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలి

**షాద్‌నగర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలలో ఉన్న పోషకాలు, రోగనిరోధక శక్తి శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష వంటివని, ప్యాకెట్ పాలను ఆశ్రయించకుండా తల్లిపాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు అందించాలని, దీంతో పిల్లల శారీరక, మానసిక వికాసం మెరుగుపడటంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీవిద్య, ఏఎన్ఎం మరియమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణీలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మా ఊరి బోనాలకు రండి



బోనాలకు రావాలంటూ ఆహ్వానిస్తున్న కౌన్సిలర్

**షాద్‌నగర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ 18వ వార్డు మహిళా కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందూలాల్, 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ బుధవారం హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులు చెకోలేకర్ లక్ష్మీ శ్రీనివాస్ దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారిని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన చెకోలేకర్ లక్ష్మీ శ్రీనివాస్ దంపతులు బోనాల ఉత్సవాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అవకాశం ఉంటే కార్యక్రమానికి హాజరవుతామని పేర్కొన్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## పట్టా భూమి రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలి

**షాద్‌నగర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని 16వ వార్డు క్రిస్టియన్ కాలనీలో ఉన్న సర్వే నంబర్ 185 ప్రభుత్వ భూమి కాదని, అది పట్టా భూమేనని పేర్కొంటూ రిజిస్ట్రేషన్లపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసి వెంటనే అనుమతులు కల్పించాలని స్థానిక కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ ఆర్డీవో సరితాకు వినతిపత్రం సమర్పించారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్

వినతి పత్రంలో ఆమె పేర్కొన్న వివరాల ప్రకారం, క్రిస్టియన్ కాలనీ సర్వే నంబర్ 185లో గతంలో గ్రామపంచాయతీ టౌన్ ప్లానింగ్ ద్వారా ఎల్పీ నంబర్లు 321/85, 697/70, 42/81, 155/81తో లేఅవుట్ అనుమతులు మంజూరయ్యాయి. అనంతరం గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ నుంచి గృహ నిర్మాణ అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. బ్యాంకుల నుంచి గృహ రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు కూడా ఈ భూముల ఆధారంగానే మంజూరయ్యాయని పేర్కొన్నారు. 1970 సంవత్సరం నుంచి ఈ భూముల్లో కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు నిరంతరంగా జరుగుతూ వచ్చాయని, 2026 జూన్ నెల వరకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. అయితే ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నంబర్ 185ను సెక్షన్ 22ఏ కింద ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్ నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు–అమ్మకాలు నిలిచిపోవడంతో పాటు గృహ రుణాలు, విద్యా రుణాల మంజూరులో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్వే నంబర్ 185ను నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా భూమిగా గుర్తించి రిజిస్ట్రేషన్లకు అనుమతి కల్పించేలా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చూపాలని కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ తన వినతిపత్రంలో కోరారు.

## షాద్‌నగర్ డిపో నుంచి 8న ఆధ్యాత్మిక యాత్ర

**షాద్‌నగర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీ ఆర్టీసీ) షాద్‌నగర్ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ (శనివారం) ఒకరోజు ఆధ్యాత్మిక యాత్రను నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ యాత్రలో అమరావతి, మంగళగిరి, విజయవాడలోని ప్రముఖ దేవాలయాలను భక్తులు సందర్శించే అవకాశం కల్పించారు. భక్తుల సౌకర్యార్థం డీలక్స్ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యాత్రకు ఒక్కొక్కరికి రూ. 1,100 చొప్పున రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో బస్సు ప్రయాణమే కాకుండా టికెట్లు కూడా ఉంటాయని వివరించారు. అయితే అల్పాహారం, భోజన ఏర్పాట్లు యాత్రికులే స్వయంగా చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. యాత్రలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9182645281, 9490021433, 7382828662, 9959226287, 9491166785 నంబర్లను సంప్రదించాలని డిపో అధికారులు తెలిపారు.

## మీరాలంమండి దేవాలయంలో ఘనంగా అమ్మ వారికి శాకంబరి పూజలు

**చార్మినార్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**

బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీ మీరా లంమండి శ్రీ మహాంకాళేశ్వర అలయంలో బుధవారం అమ్మ వారికి శాకంబరి అలంకార పూజలు అత్యంత భక్తి శ్రద్దల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మ వారికి అభిషేకాలు, కుంకు మార్చనలు, ధూప దీప నైవేద్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి. కూరగాయల మాలలతో నిమ్మ కాయల హారాలతో ప్రకాశిస్తున్న అమ్మ వారిని దర్శించు కోవటానికి పెద్ద ఎత్తునభక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటి ఛైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.



మీరాలంమండి అమ్మవారు

# సర్పంచులకు సంపూర్ణ సహకారం అందిస్తా



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

**బంట్వారం, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బంట్వారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో సుధీర్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యతిథిగా హాజరయ్యారు. సర్వసభ సమావేశంలో ముందుగా వివిధ శాఖల అధికారులు గ్రామాలలోని అభివృద్ధి ప్రణాళికలు చేసిన పనులు, పెండింగ్ పనులు వంటి అంశాలను సభలో చదివి వినిపించారు. వాటిపై సభలో ఉన్న వివిధ గ్రామాల సర్పంచులు గ్రామాలలో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రజా పాలనలో గ్రామాలలో ప్రజల నుంచి వస్తున్నటువంటి సమస్యలను ఎదుర్కోవడానికి సర్పంచులు సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడాలంటే అందుబాటులో లేకుండా ఉండడం జరుగుతుందని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మండలంలో చాలా గ్రామాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ రెస్పాన్స్ కావడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పీకర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. అనంతరం సభను ఉద్దేశించి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాలలోని సమస్యలపై అధికారులను వెంటనే సందర్శించి వాటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచులు తీసుకువచ్చినటువంటి సమస్యలపై వెంటనే పార్టీలకతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని అన్నారు. సభలో చర్చించినటువంటి అంశాలను తిరిగి 45 రోజుల తర్వాత మళ్లీ సమావేశంలో ఈ అంశాలను పరిష్కారమయ్యాయా లేదా అని తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ఎలినినో ప్రభావం వలన వర్షా బావ పరిస్థితులు ఏర్పడడంతో రైతులు పంటలు పండించుకోవడానికి ఆందోళన వ్యక్తం చేయడం జరుగుతుందని, వాటిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా పంటలు పండించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ పరికరాలు సబ్సిడీ ద్వారా అందించడం జరుగుతుందని హార్టికల్చర్ లో కూడా పంటలకు సబ్సిడీ వస్తుందని వీటన్నింటిని రైతులు తెలుసుకొని సంబంధిత అధికారితో మాట్లాడి సబ్సిడీ పొందేలా పంటలు పండించుకోవాలని అన్నారు. ఇప్పటినుంచి ప్రతి సమావేశంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని, ఒకవేళ హాజరు కానట్లయితే ఎట్టి పరిస్థితులలో ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. అధికారులందరూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలని హాజరయ్యేలా చూసే బాధ్యత సంబంధిత ఎంపీడీవో చూడాలని జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ తెలిపారు. సమావేశ అనంతరం కొత్త సర్పంచ్ లకు శాసనసభ స్పీకర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి, ఎంపీడీవో రాములు, తహసిల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్ప ఆలయ స్థల వ్యవహారంలో న్యాయం చేస్తాం

**షాద్‌నగర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ ప్రాంతంలోని సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో పురాతన బీరప్ప స్వామి దేవాలయ స్థల వివాదం నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంఘటన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి పరిస్థితులను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీఖాన్, 10వ వార్డు కౌన్సిలర్ నడికూడ శ్రావణి, ఖదీర్, రాయికల్ శ్రీనివాస్, బాలరాజు గౌడ్, సాదిక్, చందు నాయక్, బీరప్ప, రవితేజ, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మాధవులు యాదవ్, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్, సీతారాం, మహేందర్, శేఖర్, గంగమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ఇలాంటి సున్నితమైన అంశాల్లో అందరూ ప్రశాంతంగా వ్యవహరించాలని, వాస్తవ పరిస్థితులను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సీఎస్కే వెంచర్ యజమానులతో స్వయంగా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుంటానని, బీరప్ప స్వామి దేవాలయానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఇంటి స్థల యజమానులతో సమావేశం నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ అంశాన్ని తాను రాజకీయ కోణంలో చూడనని, ఇతరులు కూడా రాజకీయాలకు వేదికగా మార్చకుండా ప్రజల విశ్వాసాలను గౌరవించాలని కోరారు.



ఆలయ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

స్థానిక కౌన్సిలర్ నడికూడ శ్రావణి మాట్లాడుతూ, వివాదాస్పద అంశాల్లో వాస్తవాలను పలుమార్లు పరిశీలించిన తర్వాతే నిర్ణయాలకు రావాలని అన్నారు. కొందరు ఇలాంటి పరిస్థితులను ఉపయోగించుకుని నిరాధార ఆరోపణలు చేయడం, మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు ఈ సమస్యపై స్థానికులతో కలిసి ఆయన స్వగృహంలో వివాద వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు.

# 52వేల మందికి ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలు

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త:** వివిధ కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులు ఈఎస్ఐ కార్డులు కలిగి ఉన్నవారు శామీర్‌పేట ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలను వినియోగించుకోవాలని, వైద్యులు, సిబ్బంది కార్మికులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. బుధవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని పాత ఎంపిడిఓ కార్యాలయ సమావేశ హాల్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయటంతో ఆయన విచ్చేసి ప్రారంభించారు. గతంలో శామీర్‌పేటలో అద్దె భవనంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ కొనసాగినట్లు, ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ భవనాల్లోనే ఈఎస్ఐ డిస్పెన్సరీ కొనసాగించాలని భావించి ఖాళీగ ఉన్న శామీర్‌పేట పాత ఎంపిడిఓ కార్యాలయ సమావేశ హాల్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయటం జరిగింది. అయితే శామీర్‌పేట మండల పరిధిలో ఉన్న జెనెటిక్ కంపెనీ, హెచ్‌బిఎల్ కంపెనీల వారు సిఎస్ఆర్ నిధులతో వారు ఈఎస్ఐ డిస్పెన్సరీకి వారు సహకారాన్ని అందిస్తూ మెటీరియల్ అందజేసి వైద్యులకు, సిబ్బందికి, ఫారాసిస్ట్‌కు, కార్మిక రంగ రోగులకు సౌకర్యంగా ఉండే విధంగా క్యాబిన్స్‌తో గదులను రూపుదిద్దారు. గతంలో జిల్లా పరిషత్ పరిధిలో శామీర్‌పేట ఎంపిడిఓ కార్యాలయ భవనం ఉండటంతో మున్సిపల్‌లో విలీనం కావటంతో ఎంపిడిఓ కార్యాలయం సమావేశ హాల్ ఖాళీగ ఉండటంతో ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి జిల్లా పరిషత్ సిఇఒ సహకారంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లటంతో ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఈ భవనాన్ని కలెక్టర్ కేటాయించి అలాట్ చేయటం జరిగింది. జెనెటిక్, హెచ్‌బిఎల్ వారి సిఎస్ఆర్ నిధుల (మెటీరియల్‌తో ఏర్పాటుకు) సహకారంతో శామీర్‌పేట ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రభుత్వ భవనంలోకి మారటం తిరిగి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయటం దీనికి కంపెనీల వారు ప్రోత్సాహాన్ని అందించటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ డిస్పెన్సరీ ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సిఇఒ, జెనెటిక్, హెచ్‌బిఎల్ కంపెనీల వారి సహకారంతో శామీర్‌పేటలోని పాత ఎంపిడిఓ కార్యాలయంలో ఈఎస్ఐ డిస్పెన్సరీని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందన్నారు. శామీర్‌పేట ఈఎస్ఐ డిస్పెన్సరీ లో కార్మికులు ఈఎస్ఐ కార్డులు ఉన్న వారు 27,784మంది ఉన్నట్లు, వీరు అంత పరిసర కంపెనీలలో పనిచేసే వారు అని, ఆ కార్మికుల కుటుంబాలకు సంబంధించి 24,884మంది



శామీర్‌పేటలోని పాత ఎంపిడిఓ కార్యాలయ హాల్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రారంభించిన మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పాల్గొన్న ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి, తదితరుల దృశ్యం

డిఫెండ్ వారు ఉన్నట్లు కార్మికులతో పాటు వారికి కూడ మెరుగైన ప్రాథమిక చికిత్సలు అందించటం జరుగుతుందన్నారు. మేజర్‌గా ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని నగరంలోని సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ హాస్పిటల్‌కు, నాచారంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌కు రెఫర్ చేయటం జరుగుతుందన్నారు. ఈ ఈఎస్ఐ డిస్పెన్సరీ కింద సుమారు 52వేల మంది వరకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్యసేవలు అందించటం జరుగుతుందని ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి తెలిపారు. ప్రభుత్వ పనిదినాల్లో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈఎస్ఐ డిస్పెన్సరీలో (ఓపి) షుగర్, బిపి, జ్వరం, సాధారణ సేవలు అందించటం జరుగుతుందన్నారు. (డిప్యూటీ సివిల్ సర్జన్) ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బాలకిషన్, సిబ్బంది మొత్తం 18మంది వరకు స్టాఫ్ విధులు నిర్వహించనున్నారు. ఆదివారం, పండుగలు, ప్రభుత్వ సెలవులు ఉంటాయి. కార్మికులకు కంపెనీలకు సిక్ లీవ్‌ల, మెటర్నిటీ లీవ్స్, ప్రమాద సంఘటన లీవ్స్‌కు సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జడ్‌పి సిఇఒ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, జెడి ఆఫీస్ నుంచి డాక్టర్ కె.పద్మ, డాక్టర్ కల్యాణ్, ఈఎస్ఐ ఇన్‌చార్జి డాక్టర్ కనకదుర్గదేవి, డాక్టర్ బాలకిషన్, జెనెటిక్ కంపెనీ మేనేజర్లు అబ్దుల్, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌బిఎల్ కంపెనీ నుంచి డిజిఎం శ్రీకాంత్, సిఎస్ఓ అనూష్, జిఎం సిఎస్ఆర్ విజయలక్ష్మి, మున్సిపల్ ఎఎంసి మధుసూదన్‌రెడ్డి, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే రాజకీయాధికారం సాధించాలి : మాజీ డిజిపి పూర్ణచందర్ రావు

**చిక్కడపల్లి ఆగస్టు 5, ప్రభాతవార్త :** బహుజనులంతా ఐక్యతతో ముందడుగు వేసి ఐక్యమత్యంతోనే రాజకీయాధి కారాన్ని సాధించాలని రాష్ట్ర మాజీ డీజీపీ డాక్టర్ కె. పూర్ణచం దర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ ఐక్యసాధన సమితి ఆధ్వర్యంలో "సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా "పాపన్న ఆలోచన విధానం భావజాల వ్యాప్తి" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పూర్ణచందర్ రావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బహుజనుల ఐక్యతను చాటిచెప్పిన ఘనత సర్వాయి పాపన్నకే దక్కుతుందన్నారు. పాపన్నను స్మరించు కోవడం అంటే కేవలం పూలమాలలు వేయడం మాత్రమే కాదని, ఆయన నిర్మించిన ప్రజా ఐక్యతను తిరిగి పునర్నిర్మిం చి, ప్రజాస్వామ్య మార్గంలో రాజకీయాధికారంలో సముచిత భాగస్వామ్యం సాధించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మొఘల్ పాలనకు అనుకూలంగా పనిచేసిన జాగీర్దార్లు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌ల దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పాపన్న పోరాడారని గుర్తుచేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చిరంజీవులు మాట్లాడుతూ



బహుజనులంతా ఏకమై రాజ్యాన్ని పాలించాలనే స్ఫూర్తిని నింపిన విప్లవమూర్తి సర్దార్ సర్వాయి పాపన్న అని, ఆయన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొని యాడారు. ప్రొఫెసర్ డి. తిరుమలి మాట్లాడుతూ పాపన్న ఒక్క కులానికి చెందినవారు కాదని, ఆయన బహుజనుల ఆశాజ్యోతి అని కొనియాడారు. గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయ ణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాల్గొని బాలరాజ్ గౌడ్, యెలికేట విజయ్ కుమార్ గౌడ్, దుర్గయ్య గౌడ్, ఐబేరు శేఖర్, కోలా జనార్ధన్, పల్లె రవికుమార్ గౌడ్, బబ్బూరి భిక్షపతి, ప్రొఫెసర్ వెంకటేష్, విష్ణువర్ధన్ గౌడ్, పొన్నం నారాయణ, హరీష్ పాల్గొన్నారు.

# ఏ అవసరం ఉన్నా రండి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను వచ్చే సమావేశంలోగా పరిష్కరిస్తాం మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన పూర్తి స్థాయి సమాచారం అందించాలన్నారు. శాఖల వారిగా సమస్యలు అవసరమైన పనుల వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలు ఫోన్ చేస్తే స్పందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు అధికారులు ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికైన సర్పంచ్‌లకు అయిదేళ్ళ పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు, వచ్చేసారికి రిజర్వేషన్‌లు కుడా మారుతాయని కాబట్టి ఈ అయిదే సంవత్సరాలు మంచి పనులు చేసి ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్‌లు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి, అవగాహన కలిగించాలన్నారు, అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేయాలని రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య బద్దంగా నేను పనిచేస్తున్నానని మీ గ్రామాలలో ఏ అవసరం ఉన్నా నా దగ్గరికి వస్తే నిధులను మంజూరు చేస్తానన్నారు. నేను ప్రజాస్వామ్య బద్ధంగా శాసన సభ్యునిగా ఎన్నికయ్యానన్నారు. అన్ని రాజకీయ పక్షాలు కలిసి నన్ను ఏకగ్రీవంగా స్పీకర్‌గా ఎన్నుకున్నారన్నారు. నేను రాజకీయంగా వ్యక్తిగతంగా ఎవ్వరిని ఇబ్బంది పెట్టడం లేదని. నా దగ్గరకు ఎవ్వరు వచ్చినా పనులు చేసి పెడుతునాని ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులది కీలక పాత్ర అని మాది ఫ్రెండ్లీ గవర్నమెంట్, నేను కక్ష సాధింపు చర్యలకు ఎప్పుడూ పాల్పడబోనని రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ ఉద్యోగులకు కుడా అండగా ఉంటానన్నారు. ప్రతి గ్రామంలో యాబై లక్షల నుండి కోటి రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేయించానన్నారు. పంచాయితీ రాజ్ శాఖల ద్వారా మంజూరైన నిధులతో నియోజకవర్గంలోని అన్ని రోడ్లను బాగు చేయిస్తునాన్నారు. గ్రామాలల్లో త్రాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలలో యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. .తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తూ బ్రహ్మాండంగా పనిచేస్తున్నది గత ప్రభుత్వం కంటే మన ప్రభుత్వం ప్రజల కోసం ఎక్కువ అభివృద్ధి సంక్షేమ పథకాలను తీసుకు వచ్చింది కానీ ప్రచారం జరగడం లేదు రైతులకు రుణమాఫి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలెండర్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళా సాధికార పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఈకార్యక్రమంలో తహశీల్దార్ అనంద్‌రావు, ఏంపీడీఓ హేమంత్, మండల విద్యాధికారి చంద్రప్ప, ఏంపీఓ సురేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారి మేఘన, వివిధ శాఖల అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు,

## రైతులకు రూ.33కోట్ల చెక్కులు పంపిణీ



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అల్వాల్‌లో భూములు కోల్పోతున్న భూ యజమానులకు చెక్కులు పంపిణీ చేయగా, పాల్గొన్న డిఆర్‌ఓ మాలతి దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంలో అల్వాల్‌లో భూములు కోల్పోతున్న భూయజమానులకు పరిహారంగ చెక్కులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అందజేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తన ఛాంబర్‌లో డిఆర్‌ఓ మాలతితో కలిసి అల్వాల్ భూయజమానులకు చెక్కులను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంకు రాజీవ్‌రహదారిన 2264చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన అల్వాల్ భూయజమానులకు 33కోట్ల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ, జిల్లా భూసేకరణ అధికారి మాలతి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా అల్వాల్‌లోని స్థలానికి సంబంధించి జరుగుతున్న అసత్యప్రచారాలను, తప్పుడు ఆరోపణలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. చట్టబద్ధంగా నిబంధనల ప్రకారం ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, నక్కాయాదగిరి, జి.సిరెడ్డి, నేమాల బెనర్జీ తదితరులు

## ప్రతి టెక్నీషియన్ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి : మల్‌రెడ్డి రాంరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:**

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రతి టెక్నీషియన్ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంపొందిం చుకోవడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిం చాలని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ జేఏసీ ఆధ్వర్యంలో టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. దీనికి మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సేవ లందిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన విద్యుత్ సేవలు అందించాలంటే నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి టెక్నికల్ సెమినార్లు ఆధునిక పరికరాల వినియోగం, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ, కొత్త సాంకేతిక విధానాలపై టెక్నీషియన్లకు ఉపయోగకరమైన అవగాహన కల్పిస్తాయని అన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు సంఘటితంగా అసోసియేషన్ రూపంలో ముందుకు రావడం ద్వారా తమ వృత్తికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమర్థవంతంగా పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 8 లక్షలకు పెంచడం, కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభు త్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారం కావాలన్నా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిదృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాననిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క యాదగిరి , తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సి. రెడ్డి , ప్రధాన కార్యదర్శులు నేమా ల బెనర్జీ, వై. వెంకటేశ్వర్లు , గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పొదిలా గోవర్ధన్, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి ,తెలం గాణలోని వివిధ జిల్లాల ప్రతినిధులు లక్ష్మణ్, బ్రహ్మాచారి, కరుముద్దీన్, బుచ్చిరెడ్డి, భూపాల్ రెడ్డి , ఎం. కృష్ణ , కె. భీమేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

**కీసర, ఆగస్టు5, ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్ అన్నారు. బుధవారం నాగారం డివిజన్ పరిధిలోని రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో 8 లక్షల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్‌సుఖ్‌నగర్ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, కాలనీ అధ్యక్షులు దాసు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు గండి శ్రీశైలం, బాలరాజు యాదవ్, కౌకుట్ల జీవన్‌రెడ్డి, అరిగె రాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి

**కీసర, ఆగస్టు5, ప్రభాతవార్త:** విద్యార్దులు ఉన్నత చదువులు చదవాలని కీసర ప్రభుత్వ వైద్యాధికారి మనూజరెడ్డి అన్నారు. బుధవారం కీసర సర్కిల్ పరిధిలోని ఘనంగా నవోదయ స్దాపన దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్దులకు దిశా నిర్దేశం చేసి, ప్రతి ఒక్క విద్యార్ది ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని కోరారు. పివి నిరసింహ్మారావు, రాజీవ్‌గాందీ ప్రధానమంత్రు లు గా ఉన్న రోజులలో 1986వ సంవత్సరంలో ప్రతి భావంతులైన గ్రామీణ విద్యా ర్దులను ఉన్నత స్దితిలో చూడాలనే సంకల్పంతో ఈ విద్యాలయాలను యావద్బారత దేశంలో 662 విద్యాలయాలు ప్రారంభించి వారి ఉదార గుణాన్ని చాటుకున్నారన్నారు. నవోదయ పాఠశాలలో చదివిన విద్యార్దులు ఉత్తమ పౌరులుగా మారి సమాజంలో ఉత్తమమైన సేవలందిస్తున్నారన్నారు. ఈ విద్యాలయాల్లో చదువుకున్న ఎందరో విద్యార్దులు ఉన్నత స్దానాలలో ప్రతి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ సమాజ సేవలో నిమగ్నులై తరిస్తున్నారన్నారు. ఎంపి ఈటల రాజేందర్ విద్యార్దుల అత్యవసర వసతుల కల్పన అడిగిన వెంటనే ఏర్పాటు చేసినందుకు విద్యార్దుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్దులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 5, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ముష్టిపల్లి గ్రామంలోగల శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విద్యుత్ అవసరాల నిమిత్తం గ్రామస్థులు కోరినమేరకు నూతన


విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పెర్కొన్నారు. దేవాలయం వద్ద విద్యుత్ సమస్య ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళితే వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, రజిత, శేఖర్, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ పూజారి లక్ష్మీ నరసింహ, వెంకటేష్, సురేష్, శ్రీను, సోమయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడి

-మద్యం సీసాలు స్వాధీనం

**ఘట్‌కేసర్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని మద్యం బెల్టు షాపుపై బుధవారం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. అవుషాపూర్‌లో మద్యం అక్రమ అమ్మకాలతో మందుకు అలవాటు పడి ఎంతో మంది అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారని నిర్వాహకులపై ఇటీవల బిజెపి నాయకులు మహేశ్ ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ ఎస్ఐ నందిని ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది అవుషాపూర్ మెయిన్‌రోడ్డు దగ్గర ఎరుకల నరేందర్ ఇంట్లో దాడి చేసి తనిఖీలు జరుపగా మద్యం సీసాలు దొరికాయి. నరేందర్‌ను అదుపులోకి తీసుకొని దాదాపు రూ.15 వేల విలువైన మద్యం సీసాలను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బెల్టు షాపు నిర్వాహకుడు నరేందర్‌కు సంబంధించిన ఆటోలో కూడా మద్యం లభించగా సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన మహేశ్ బెల్టుషాపు నిర్వాహకులకు సంబంధించిన సమాచారం ఇచ్చి మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరారు. మద్యం తరలిస్తున్న ఆటోను పోలీసులు సీజ్ చేయకుండా వదిలి వేశారని స్థానికులు ఆరోపించారు. ఎక్సైజ్ పోలీసులు బెల్టుషాపు నిర్వాహకులకు సహకరిస్తూ నామమాత్రంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. బెల్టుషాపుతో స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కూలీలు నిత్యం మద్యంకు బానిసై ఆరోగ్యాన్ని, కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని మహేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.


అవుషాపూర్‌లో ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన మద్యం సీసాలు

# విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





## విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు

**మొయినాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసాల పట్ల విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ పంచుకోవద్దని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఐపీఎస్ తరుణ్ జోషి సూచించారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ జాగృతిక్ దివాస్-2026 కార్యక్రమం నిర్వహించారు. పౌరసత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, చేవెళ్ల జోన్ డిప్యూటీ కమిషనర్ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ ప్రపంచం కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలోకి అడుగుపెడుతుండగా, సైబర్ నేరగాళ్లు కూడా అదే స్థాయిలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార భద్రత, బలమైన పాస్‌వర్డ్ వినియోగం, ద్విదశల భద్రత అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులకు లేదా అధికారిక సైబర్ వేదికల ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రతిజ్ఞ చేసి సైబర్ భద్రతపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా జ్యోతి కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఆర్. వెంకటాచలం, ఈసీఈ విభాగాధిపతి పి. నాగేశ్వరరావు, అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రైతులకు పలు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

## పత్తి రైతులకు శాస్త్రవేత్తల హెచ్చరిక

పురుగులపై అప్రమత్తంగా ఉండాలి!

**కొత్తూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త:**

రైతులు పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పాటు, పురుగుల ఉధృతిని ఎప్పటికప్పుడు గుర్తించి శాస్త్రీయ పద్ధతుల్లో నివారణ చర్యలు చేపట్టాలని పీజేటీయూ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు సూచించారు. దత్తత గ్రామ కార్యక్రమంలో భాగంగా కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామంలో పత్తి, కాకర పంటలను శాస్త్రవేత్తల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పత్తిలో బంక, పచ్చదోమ ఉధృతి ప్రస్తుతం పత్తి పంట శాకీయ దశలో ఉందని, పంటలో పెను బంక, పచ్చదోమ, ఉధృతి ఆర్థిక నష్టస్థాయికి చేరువలో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ నేపథ్యంలో రైతులు సమగ్ర పురుగు యాజమాన్య పద్ధతులు (ఐపీఎం) పాటించాలని సూచించారు. పురుగుల ఉధృతిని తొలిదశలోనే గుర్తించేందుకు ఎకరాకు 10 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పురుగుల ఉధృతి అధికంగా ఉన్న పొలాల్లో వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకు ఫ్లోనికమైడ్ 50 జూబి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందించారు. అధిక ఎరువులతో జాగ్రత్త..పంట ఎదుగుదల కోసం అవసరానికి మించి కాంప్లెక్స్ ఎరువులు వినియోగించవద్దని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. అధిక నత్రజని వినియోగం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని వివరించారు. పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య పోషకాలను అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కాకరలో తెల్లదోమ గుర్తింపుకాకర పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు తెల్లదోమ ఉధృతిని గుర్తించారు. దీని నివారణకు వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పంటలో నిరంతరం పర్యవేక్షణ చేయడం, కలుపు మొక్కలను తొలగించడం, సమతుల్య ఎరువులు వినియోగించడం, పురుగుల ఉధృతి ఆర్థిక నష్టస్థాయికి చేరినప్పుడు మాత్రమే సిఫారసు చేసిన పురుగుమందులను ఉపయోగించడం ద్వారా ఖర్చును తగ్గించడంతో పాటు పంటను కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. రైతులకు శాస్త్రీయ సూచనలు. ఈ క్షేత్ర సందర్శనలో డా. భానురేఖ, డా. సుమాలిని, డా. అర్చన, డా. ఎం. రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి గోపాల్ నాయక్, మల్లాపూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు. సుమారు 15 మంది ఆదర్శ రైతులు పాల్గొని శాస్త్రవేత్తల నుంచి పంట సంరక్షణ, పురుగుల నివారణ, సమతుల్య ఎరువుల వినియోగంపై శాస్త్రీయ సూచనలు పొందారు. పంటలో పురుగు కనిపించిన వెంటనే మందులు పిచికారీ చేయడం కాకుండా.. ముందుగా పంటను పరిశీలించి, పురుగు ఉధృతి, ఆర్థిక నష్టస్థాయిని అంచనా వేసి అవసరమైనప్పుడు మాత్రమే సిఫారసు చేసిన మందులను వినియోగించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.

## ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**మర్పల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బ్యాగరి మల్లయ్య మృతి చెందడంతో అట్టి విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఎ.పద్మ సంజీవరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డుమెంబర్స్ రాములు, చంద్రయ్య, రాచ్చయ్య, మొగులయ్య, యెసయ్య మల్లయ్య శేఖర్ శ్రీకర్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్

## సైబర్ క్రైమ్‌పై అవగాహన

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 5, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని దక్ష ప్రైవేటు పాఠశాలలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్ మాట్లాడుతూ సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పెర్కొన్నారు. పెట్టుబడి మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ప్రకటన మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితోపాటు పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 5, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజు విద్యుత్ కోతలు ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. ఉదయం రాత్రిళ్లు తేడా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు విద్యుత్ నిలిపివేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు విద్యుత్ ఉంటుందో ఎప్పుడుపోతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సబ్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు గంటల తరబడి ఎల్‌సిలు ఇవ్వడం, విధులు సరిగ్గా నిర్వహించకపోవడం వలన సామాన్యప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. చిన్నపాటి గాలులు, వర్షాలు కురిస్తే చాలు విద్యుత్ సరఫర నిలిపివేస్తారని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాపై ఫోన్‌చేస్తే ఇప్పుడు అప్పుడు అంటూ కాలం వెల్లదీస్తారు కాని సమస్య పరిష్కారం చూపడంలేదని ప్రజలు అంటున్నారు. ప్రతిరోజు ఉదయం విద్యుత్ సమస్య ఉందని సంబంధిత అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండ చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


తల్లిపాల ప్రాముఖ్యతమై అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న పీజీ వైద్య విద్యార్థులు

## తల్లిపాలపై తల్లులకు, గర్భిణులకు అవగాహన

**మేడ్చల్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మేడ్చల్ మండలం, ఘన్‌పూర్‌లో గల మెడిసిటి ఆస్పత్రిలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో కలసి పిల్లల తల్లులకు, గర్భిణులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై పలువురు వైద్యులు అవగాహన కల్పిస్తూ శిశువుకు అందించే ఆహారంలో తల్లి పాలు అన్నింటి కన్నా శ్రేష్టమైనవి, సురక్షితమైనవని తెలిపారు. తల్లి పాలివ్వడం ద్వారా తల్లిబిడ్డల మధ్య అను బంధం గట్టిపడుతుందని అందుకు శిశువుకు తల్లి పాలు అందివ్వాలని చెప్పారు. ఎలాంటి అపోహలు లేకుండా తల్లులు పిల్లలకు స్వయంగా పాలు పట్టాలని సూచించారు. తల్లి పాలతో గేదె, ఆవు పాలను పోల్చలేమని, తల్లి పాలకు డబ్బా పాలు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు.

కార్యక్రమం అనంతరం మెడిసిటి వైద్య కళాశాలకు చెందిన పీజీ విద్యార్థులు తల్లి పాల విశిష్టతను వివరిస్తూ దానిపై ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన స్కిట్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలలో మెడిసిటి హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గీత, మెడిసిటి వైద్య కళాశాల పీడియాట్రిక్ విభాగం హెడ్ డాక్టర్ సుదర్శన్, కమ్యూనటి మెడిసన్ హెడ్ ఈనాక్షి గంగూళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సమీర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, డా. నాగరాజు, మెడికల్ కళాశాల పీజి విద్యార్థులు, వైద్యులు, తల్లులు, గర్భిణి స్త్రీలు పాల్గొన్నారు.

## తాండాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం

**కేశంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త :** గ్రామాలు, తండాలలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్షమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీస కరుణాకర్ రెడ్డి అన్నారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామ పంచాయతీ పరిధిలోగల బాల్యతండాలో డి ఎం ఎఫ్ టీ నిధులనుండి మంజూరు అయిన 5 హెచ్ పి సబ్మెర్సిబుల్ బోరు మోటర్‌ను తొమ్మిది రేకుల గ్రామ ఉప సర్పంచ్ ఉత్యావత్ రవి నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరుణాకర్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ రవి నాయక్ మాట్లాడుతూ తండాల లో మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తండాలో నీటి సమస్య ఉన్న విషయాన్ని గ్రామ సర్పంచి కవితా కరుణాకర్ రెడ్డి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగావెంటనే స్పందించి బోరు మోటర్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా తాండ వాసులు మాట్లాడుతూ అడిగిన వెంటనే బోట్ మోటర్ మంజూరు చేయించి మా తాండావాసుల కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, అందుకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు లైన కరుణాకర్ రెడ్డి, రవి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ బాలు ఏఈ నరేష్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, నాయకులు, వార్డు సభ్యులు లచ్చి రామ్ నాయక్, చెన్నయ్య, అంజి నాయక్, రమేష్ నాయక్, తండావాసులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ నాయకుడు కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రవి నాయక్

## బిఎల్ఓలను అభినందించిన ఆర్డిఓ



**కందుకూరు, ఆగస్టు 5, (ప్రభాతవార్త):** ఎన్నికల యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కందుకూరు మండలంలో విజయవంతం కావడంలో బి ఎల్ వోల పాత్ర అభినందనీయమని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కందుకూరు మండలంలోని 60 పోలింగ్ కేంద్రాలలో 30 మంది బిఎల్వోలు శ్రమించి ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఓటర్ల జాబితాను సమర్థవంతంగా పూర్తి చేయడం జరిగిందని అందులో 80 శాతానికి పైగా డిజిటలైజేషన్ చేయడం జరిగిందని ఇది మంచి అచీవ్మెంట్ అని తెలిపారు. అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో బిఎల్ఓలో చేసిన కృషి అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడంలో బిఎల్వోలు ఇకముందు కూడా పూర్తిస్థాయి లక్ష్యాలను చేరుకొని ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు తాసిల్దార్ గోపాల్, ఉప తాసిల్దార్ శేఖర్, ఎంపీడీవో సరిత తో పాటు ఆయా గ్రామాల బిఎల్వోలు పాల్గొన్నారు. వారికి అధికారులు మేమంటలను అందించారు.


కొందుర్గులో తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ!

## తల్లిపాలు బిడ్డకు ఎంతో మంచివి!

**కొందుర్గు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** పుట్టినబిడ్డకు తల్లిపాలు త్రాగించడం ఎంతో మంచిదని సర్పంచ్ చౌదపురం ప్రభాకర్ అన్నారు. బుధవారంనాడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి తల్లిపాలు వారోత్సవాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల గురించి బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలని అంగన్వాడీ టీచర్లను, ఆశా వర్కర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రజియా బేగం, జి మణ మ్మ, ప్రేమలత, భాగ్యమ్మ. టి.మణెమ్మ, సంగీత, ఆశ వర్కర్లు సువర్ణ, బాలమణి, సుందరమ్మ, అంజలి, సంతోష తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**దౌల్తాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బుధవారంరోజు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ వార్సోవాలలో భాగంగా గ్రామస్తులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సంధర్బంగా కార్యక్రమంలో పాల్గొన్న పీడీఎంవో డా. సౌమ్య మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష లాంటివని అన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకూ ముర్రు పాలతో పాటు తల్లిపాలు తప్పనిసరిగా పట్టాలని ఆమె సూచించారు. తల్లిపాలు త్రాగించడం ద్వారా శిశువు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, పంచాయతీ కార్యదర్శి బసంత్, అంగన్వాడీ టీచర్ పద్మమ్మ, ఏఎన్ఎం మంజుల, ఆశా వర్కర్ శ్యామమ్మ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..


తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న పీడీఎంఓ డా.సౌమ్య

# మచ్చలేని నాయకుడు మనోహరన్న.!


కేక్ కట్ చేస్తున్న నేతలు, అభిమానులు

-- ఘనంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

-- తాండూరులో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు

**తాండూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** మచ్చలేని నాయకుడు మనోహరన్న అంటూ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టి అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే మనోహంరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా, పట్టణ అధ్యక్షులు నాగరాజు, పార్టీనాయకులు, అభిమానులు ఉదయం పట్టణంలోని భద్రేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఆసుపత్రిలో అల్పాహారంతో పాటు రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన పాటను ఆవిష్కరిస్తూ.. కేక్‌ను కట్‌చేసి చేస్తూ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారులు బుయ్యని శివకుమార్‌రెడ్డి, బుయ్యని అవినాష్‌రెడ్డి, బుయ్యని ప్రణయ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య సందడిగా వేడుకలను జరుపుకొన్నారు.

## లోక్‌సభ చీఫ్ విఫ్‌ను కలిసిన బిఎస్ఆర్

**తాండూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లోక్‌సభ సభ్యులు, లోక్‌సభ చీఫ్ విఫ్ కొడికున్నిల్ సురేష్‌ను తాండూరు ఆర్టీఓఎల్ సీఈఓ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలో లోక్ సభ చీఫ్ విఫ్ కొడికున్నిల్ సరేష్‌ను శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అదేవిధంగా దేశ, రాష్ట్రాల్లో నెలకొన్న సమకాలీన రాజకీయ పరిణామాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు.


లోక్‌సభ చీఫ్ విఫ్‌ను కలిసిన బిఎస్ఆర్.

# బాలలకు, గర్భిణీలకు నాణ్యమైన భోజనం అందించాలి

**ఆమనగల్లు, ఆగస్టు5, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహ నఆమనగల్లు ఆగస్టు 5 ప్రభాతవార్త: ఆమనగల్ పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో బుధవారం స్థానిక పోలీస్ అధికారులు విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ హెచ్ ఓ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ ఏ. సంతోష్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి కళాశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు సైబర్ నేరాల గురించి స్పష్టంగా వివరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగ్రూకత దివస్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులకు ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాలైన నకిలీ స్టాక్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్ , ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా నాసిరకం లేదా వస్తువులు అందకుండా చేసే మోసాలు గురించి వివరించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు అధికారులు వెంకటేశ్వర్లు, సంతోష్ రెడ్డిలు వివరించారు. అలాగే, అపరిచిత వ్యక్తులతో ఓటిపి బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు మరియు వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదు అన్నారు. పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి వివరాలు ధృవీకరించుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో విశ్వసనీయ వెబ్‌సైట్లు మరియు యాప్‌లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని, వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు ఆకుల కృష్ణయ్య, గోపాల్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు



మత్స్యకార సొసైటీ నూతన సభ్యులు

## ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

**ఇప్పలపల్లి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ముదిరాజ్ ఏకగ్రీవం**

**కేశంపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ మత్స్యకార సొసైటీ నూతన అధ్యక్షుడిగా గడ్డమీది శ్రీనివాస్ ముదిరాజ్ ను మత్స్యకార సొసైటీ రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి ఖాజా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా రొయ్యల శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సురమోని శివ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా భక్తవత్సల ముదిరాజ్, గడ్డమీద శివ ముదిరాజ్, సురమోని రవి ముదిరాజ్, సురమోని లింగం ముదిరాజ్, సురమోని వెంకటేష్ ముదిరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ నూతన మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకార సొసైటీ సభ్యులకు గ్రామంలో అందు బాటులో ఉంటూ నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతను శక్తి వంచన లేకుండా కృషిచేస్తూ మత్స్యకార సొసైటీకి, ముదిరాజ్ సంఘం అభివృద్ధికి శక్తి వహించిన లేకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం, మత్స్యకార మాజీ అధ్యక్షుడు సహదేవ్, నూతనంగా ఎన్నికైన మత్స్యకారి అధ్యక్షులకు కార్యవర్గ సభ్యులకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లఆటో

## అక్రమ గ్యాస్ సిలిండర్ల విక్రయంపై చర్యలు

**-సిలిండర్లు సీజ్..ఇద్దరు అరెస్ట్**

**ఘట్‌కేసర్, ఆగష్టు 5, ప్రభాతవార్త:** గృహావంటకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా హోటళ్లకుకు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 44 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 9 వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్ఓటి బృందం వచ్చి ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఎల్‌పిజి సిలిండర్లను ఆటో ట్రాలీలో తరలిస్తున్నట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకొని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పూస రామ్ (43), ఓంప్రకాష్ (32)లు సబ్సీడీపై లభించే గృహుపయోగ ఎల్‌పిజి సిలిండర్లను లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని టీస్టాల్స్, హోటళ్ల తదితర వాణిజ్య సంస్థలకు అధిక ధరలకు విక్రయిస్తున్నాట్లు నిర్ధారణ అయ్యింది. డొమెస్టిక్ సిలిండర్లలోని గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలోకి అక్రమంగా బదిలీ చేస్తున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి 5 డొమెస్టిక్ ఎల్‌పిజి సిలిండర్లు, 4 కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్లు, 36 చిన్న ఎల్‌పిజి సిలిండర్లు, సుజుకి ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సబ్సిడీ గృహోపయోగ ఎల్‌పిజి సిలిండర్లను అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడంతో పాటు వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్టవిరుద్ధమని, ప్రజల భద్రతకు హాని కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.




జోనల్ కార్యదర్శి విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న పిఈటిలు

## ఎస్‌జిఎఫ్ జోనల్ కార్యదర్శిగా విద్యాసాగర్ ఎంపిక

**ఘట్‌కేసర్, ఆగష్టు 5, ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్, మేడిపల్లి జోనల్ కార్యదర్శిగా ఎంపిఎం.విద్యాసాగర్ నియమితులయ్యారు. బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా విద్యాశాఖ అధికారి సమక్షంలో బోడుప్పల్ జడ్పీహెచ్ఎస్ పిజికల్ డైరక్టర్ విద్యాసాగర్‌ను ఘట్‌కేసర్, మేడిపల్లి జోనల్ సెక్రెటరీగా జిల్లా విద్యాధికారిచే నియమించారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల జోనల్ వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విద్యాసాగర్‌ను సన్మానించి అభినందించారు.



హరివర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరేందర్

## హరివర్దన్‌రెడ్డికి అమరేందర్ సత్కారం

**ఘట్‌కేసర్, ఆగష్టు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్ బుధవారం మేడ్చల్ డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్దన్‌రెడ్డిని సన్మానించారు. మేడ్చల్ గౌడవెల్లిలోని ఆయన అతిధి గృహంలో అమరేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేశారు.

ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో ఈనెల 13 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని అమరేందర్, హరివర్దన్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం మాజీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మెట్టు నర్సింహ్మా, పూల మహేశ్‌లు పాల్గొన్నారు.

# వ్యవసాయాభివృద్ధిపై నిపుణుల బృందం పర్యటన



కొడంగల్ కాడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ

**కొడంగల్,దౌల్తాబాద్ ఆగస్టు 5,ప్రభాతవార్త:**

కొడంగల్ నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ,ఉద్యానవన,పట్టు పరిశ్రమల అభివృద్ధి,స్వయం సహాయక మహిళా సంఘాలు,రైతు సంఘాల బలోపేతంపై చర్చించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందం బుధవారంరోజు కొడంగల్,దౌల్తాబాద్,బొంరాస్‌పేట్ మండలాలలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఇక్రిసాట్ సీనియర్ సైంటిస్ట్,బృంద చైర్మన్ డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో బహుళ శాఖల నైపుణ్య అధికారులు కొడంగల్‌లోని కాడా కార్యాలయానికి చేరుకొని...ఈ పర్యటనలో భాగంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో నిపుణుల బృందం ప్రత్యేక సమావేశం నిర్వహించింది.నియోజకవర్గంలో ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి కార్య క్రమాలు,భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై వారు విస్తృతంగా సమీక్ష జరిపారు.అనంతరం కొడంగల్ మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో కొడం గల్ ఫార్మర్ సర్వీస్ ప్రొడ్యూసర్ కంపెనీని సందర్శించి,ఆ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాల గురించి వివరాలు అడిగి తెలుకున్నారు.అనంతరం దౌల్తాబాద్ మండలం చెల్లాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతులు,అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు,ఉద్యానవన శాఖ అంశాలపై చర్చించి రైతుల ఆకాంక్షలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ...రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు, కూరగాయల సాగుకు అవసరమైన డ్రిప్,మల్చింగ్,స్ప్రింక్లర్ పరికరాలను అందించాలని కోరారు.అనంతరం బొంరాస్‌పేట్ రైతు వేదికలోనూ మహిళా సంఘాలు,రైతులతో సమావేశం నిర్వహించి,వారి అవసరాలపై చర్చలు జరి పారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్,డి.ఏ.ఓ.,ఏ.డీ. ,ఉద్యానవన శాఖ జె.డి.శ్రీబాబు,ఆపెడా అధికారులు,నాబార్డ్ అధికారులు, హార్టికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.భగవన్,అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్ర వేత్తలు,మార్కెటింగ్ శాఖ అధికారుల బృందం,డి.హెచ్.ఎస్.ఓ ఎం.ఎ.సత్తార్,పట్టు పరిశ్రమ జె.డి.లత, డిఆర్‌డిఏ అధికారి,కొడంగల్ హెచ్.ఓ సురేంద్రనాథ్,జనరల్ మేనేజర్ మహమ్మద్ వసీమ్,ఆయా శాఖల అధికారులు,సంస్థ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.




దౌల్తాబాద్ మండలం చెల్లాపూర్ గ్రామంలోని రైతువేదికలో రైతులతో సమావేశమైన శాస్త్రవేత్తలు,ఉన్నతాధికారులు

## గురుకుల పాఠశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**-ప్రిన్సిపల్ సిహెచ్.ఉషాకిరణ్**

**వికారాబాద్,ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి మోమిన్‌పేట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీట్లకు స్పాట్ అడ్మిషన్‌లు తీసుకోనున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.ఉషాకిరణ్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులో సీట్లు కావాలనే విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై ఈ నెల 7 వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జోనల్ అధికారి ఉత్తర్వుల మేరకు కళాశాలలో మిగిలిన సీట్లను నేరుగా భర్తీ చేయ నున్నట్లు పేర్కొన్నారు. 2026 లో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులైన బాలికలు మాత్రమే అర్హులని, ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు టిసి, బోనఫైడ్, కుల, ఆదాయ, నివాస ఒరిజినల్, జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ లతో నేరుగా బూర్గుపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

## వికారాబాద్ ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్ఎం

**వికారాబాద్,ప్రభాతవార్త :** ఆర్టీసీ రంగారెడ్డి రిజినల్ మేనేజర్ శ్రీదేవి బుధవారం వికారాబాద్ డిపో ను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో లోని అన్ని శాఖలు తనిఖీ చేశారు. డిపో నష్టాలను పరిశీలించి పర్సనల్ కాస్ట్ సీపీకె లో తాండూర్, పరిగి డిపోలలో.. 30 రూపాయలు ఉండగా, వికారాబాద్ డిపో లో 35 రూపాయలు ఉన్నదని తెలిపారు. ఈ 5 రూపాయలు సీపీకె ఎక్కువ యాండర్




వికారాబాద్ డిపోను సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేస్తున్న ఆర్ఎం శ్రీదేవి

వలన రోజు కు రూ.25,000 కెఎంఎస్ డిపో నడుస్తుండగా..రూ.1,25,000 రోజు నష్టం వస్తుందని నిట్టూర్చారు. ఈ నష్టం వలన ఈ డిపో కు నెలకు దాదాపుగా 38 లక్షలు నష్టం వస్తుందని, సంవత్సరానికి రూ.4.50 కోట్లు నష్టం వస్తుందని లెక్కలు తెల్చారు. వికారాబాద్ డిపో ఆర్థిక పరిస్థితిలో 90 వ డిపో, రూరల్ డిపో లలో చివరి డిపో గా ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అదిగమించడానికి ప్రతి ఉద్యోగి మరింత భాద్యతగా పెయిడ్ ప్యాసెంజర్స్ ను పెంచుకోవాలని సూచించారు. వీటితో పాటు స్పెషల్ హైర్ బుకింగ్స్ పెంచుకోవాలని, యాత్ర దానం స్పెషల్ బుకింగ్స్ పెంచుకోవాలని అన్నారు. ఖర్చులకు సంబందించి డీజిల్ కెఎంపీఎల్ ఆదా చెయ్యాలని తెలిపారు. పలు విభాగల నుండి ఖర్చు తగ్గిస్తూనే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. నేటి నుంచి బస్సులో మెడికల్ కిట్స్ ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రత తదితరులు పాలొనగన్నారు.

# వైభవంగా బోనాల వేడుకలు..



నర్సప్పగూడలో జరిగిన బోనాలు వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ తదితరులు

నర్సప్పగూడలో .....

**నందిగామ, ఆగస్టు 5, ప్రభాతవార్త :** నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో బుధవారం రేణుకఎల్లమ్మ మాత బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. మాజీ సర్పంచ్ కావలి కృష్ణ ఆధ్వర్యంలో మహిళల ఆటపాటలతో, డిజె సౌండ్ సిస్టం మధ్య, పోతురాజుల విన్యాసాల మధ్య, టపాకాయలు కాలుస్తూ ఘనంగా జరిగాయి. ఈ బోనాల వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది . చిన్న, పెద్ద ,ముసలి ముతక ,వయోభేదం లేకుండా మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ ఏలినీవో ఎఫెక్ట్ ప్రభావం పడకుండా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో సూర్య రిపోర్టర్ కావలి ప్రభాకర్ యాదవ్, కావలి బుచ్చిలింగం, వెంకట్ స్వామి, హనుమాన్, డాక్టర్ మల్లేష్, పాండురంగం, నరేష్, వెంకటేష్ గ్రామస్తులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో ముమ్మరంగా సాగుతున్న బోనాల ఏర్పాట్లు

**నందిగామ, ఆగస్టు 5, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలోని 6 వ వార్డులో శివ గళ్ళ ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఎల్.టి విద్యుత్ లైన్ వేశారు. ఆషాడ మాసం బోనాల వేడుకలను పురస్కరించుకొని సర్పంచ్ కొమ్ము కృష్ణ గ్రామంలోని అన్ని కాలనీలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, వీధి దీపాలు బిగించడంతో కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, చించేటి లతా శివకుమార్, నాయకులు ఎం ప్రభయ్య,వంకాయల శ్రీనివాస్ రెడ్డి, కేశమోని రామచంద్రి, ఎర్రగారి రమేష్, చేన్నగళ్ళ శ్రవణ్ కుమార్, అభిరామ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో రేణుక ఎల్లమ్మ మాత దేవాలయానికి వెళ్లే దారిని డోజర్ సాయంతో శుభ్రం చేయిస్తున్న సర్పంచ్.

## జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో (తుర్కపల్లి)లో విజిబుల్ పోలిసింగ్

**..వాహనాలను తనిఖీలు చేసిన..సిఐ గురువయ్యగౌడ్**

**..పోలీస్‌సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన వైనం**

**..సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**



జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో (తుర్కపల్లి)లో విజిబుల్ పోలిసింగ్ భాగంగా వాహనాలను తనిఖీలు చేసిన సిఐ గురువయ్యగౌడ్, సిబ్బంది దృశ్యం



తుర్కపల్లిలో కాలినడకన ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన సిఐ గురువయ్యగౌడ్, సిబ్బంది దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త:** జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కపల్లిలో విజిబుల్ పోలిసింగ్ నిర్వహించి వాహనాలను జీనోమ్‌వ్యాలీ పోలీస్ సిఐ గోపగాని గురువయ్యగౌడ్ తనిఖీలు చేశారు. బుధవారం శామీర్‌పేట మండలం జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో తుర్కపల్లి మార్కెట్‌లో విజిబుల్ పోలిసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి వాహనాలను తనిఖీలు చేశారు. కాలనడకన ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాహనాల తనిఖీలను చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు ఆయన సూచించారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులు లేదా అనుమానస్పద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గమనించినా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రజల భద్రత, నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణకు జీనోమ్‌వ్యాలీ పోలీసులు విజిబుల్ పోలిసింగ్‌ను నిరంతరం కొనసాగిస్తామని సిఐ గురువయ్యగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**..జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన..**

..జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దక్ష జూనియర్ కళాశాల మజీద్‌పూర్‌లో సిఐ గోపగాని గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం శామీర్‌పేట మండల పరిధిలోని తుర్కపల్లిలో ఉన్న జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలి, ఆన్‌లైన్ మోసాలను ఎలా గుర్తించాలి, సోషల్ మీడియాను సురక్షితంగా ఎలా వినియోగించాలి, బ్యాంకింగ్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటిపి, సివివి, ఎటిఎం, పిన్ పాస్‌వర్డ్ వంటి గోప్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని వివరించారు. అదే విధంగా తెలియని లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి పథకాలు, లోన్‌యాప్‌లు, క్యూఆర్‌కోడ్స్ మోసాలు, స్క్రీన్ షేరింగ్‌యాప్‌ల ప్రమాదాలు, సోషల్ మీడియా ప్రైవసీ, ఫేక్ న్యూస్, సైబర్ బుల్లీయింగ్ , ఎఐఎం స్వాప్ మోసాలు, ఫేక్ కస్టమర్ నెంబర్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సిఐ గురువయ్యగౌడ్ సూచించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు పాటించటం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగ ఉండటం, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. జీనోమ్‌వ్యాలీ పోలీసులు ప్రజలలో సైబర్‌నేరాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ సురక్షిత డిజిటల్ సమాజ నిర్మాణంకు కృషి చేస్తున్నామని సిఐ గోపగాని గురువయ్యగౌడ్ తెలిపారు.

## ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు గౌరవవేతనం ఇవ్వాలి



అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన టిఎస్ యుటిఎఫ్ శామీర్‌పేట మండల అధ్యక్షులు పి.తిరుమలేశ్, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త:**

వేసవిలో అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలో జనగణన విధులు నిర్వహించిన ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు గౌరవవేతనం వెంటనే విడుదల చేయాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డికి టిఎస్ యుటిఎఫ్ శామీర్‌పేట మండల అధ్యక్షులు పి.తిరుమలేశ్,పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని కలిసి వారు విన్నవించారు. ఆ తరువాత చర్చించి కలెక్టరేట్ నుంచి చార్జ్ ఆఫీసర్ అకౌంట్లోకి నిధులు జమ కాగానే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గౌరవ వేతనం అందించనున్నట్లు తెలిపారు. త్వరలోనే గౌరవేతనం చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వటం జరిగిందని అధ్యక్షులు తిరుమలేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు నెహ్రూ, దేవేందర్, నాగపూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

### ఏ సమస్య ఉన్నా

## మున్సిపల్ కీసర సర్కిల్‌కు వెళ్లాలంటే ఎలా..?

**..శామీర్‌పేట డివిజన్ ప్రజల ఇబ్బందులు..స్థానిక డివిజన్ ఆఫీస్‌లో ధరఖాస్తులు,ఫిర్యాదులు స్వీకరించటానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి ..ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలి**

**..శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి నాలిక యాదగిరి**

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త:**

ప్రజలకు ఏ సమస్య ఉన్నా..ఏ ధరఖాస్తు ఇవ్వాలన్నా మున్సిపల్ కీసర సర్కిల్‌కు శామీర్‌పేట డివిజన్ ప్రజలు వెళ్లాలంటే ఎలా అని, దీంతో ప్రజలు వెళ్లటానికి నానా ఇబ్బందులు పడుతున్నట్లు శామీర్‌పేట డివిజన్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని, ధరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు తీర్చాలని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి నాలిక యాదగిరి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న తూంకుంట మున్సిపాల్టీ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో విలీనం అయిన తరువాత శామీర్‌పేట డివిజన్ ప్రజల సమస్యలు పెరిగాయని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తు ఇవ్వాలన్నా కీసర సర్కిల్ కార్యాలయంకు శామీర్‌పేట డివిజన్ ప్రజలు వెళ్లాల్సి వస్తుందని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. బస్సులు, ఆటోలు పట్టుకుని వెళ్లాలన్నా సమయానికి ఉండవని దీంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని అన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలుపాలన్నా..ఫిర్యాదు చేయాలన్నా కీసర సర్కిల్ వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అదే విధంగా ఫింఛన్లు కావాలన్నా, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కావాలన్నా, ఇందిరమ్మ ఇండ్లు కావాలన్నా ధరఖాస్తులు చేసుకోవటానికి కీసర సర్కిల్ ఆఫీస్‌కు వెళ్లటంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించి శామీర్‌పేట డివిజన్ కార్యాలయంలో అధికారులను అందుబాటులో ఉంచాలని, ధరఖాస్తుల, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి నాలిక యాదగిరి కోరారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్, సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

## నేటి నుండి ఆసుపత్రి ముందు నిరాహార దీక్ష !

**కొందుర్గు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌తో ఆసుపత్రి ముందు ఈనెల 6వ తేదీ నుండి నిరాహార దీక్ష చేపడుతున్నట్లు షాద్నగర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటయ్య, మండల నాయకులు మీది కేరి రాధాకృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మండలాల్లో ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో ప్రతిరోజు చికిత్సకోసం పేదరోగులు , గర్భిణీస్త్రీలు అనేకమంది వస్తుంటారని తెలిపారు. రోగులకు వైద్యం అందించడానికి సిబ్బంది అందుబాటులో ఉండ రని,అలాగే మందులు ఉండవు అని ఆరోపించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇబ్బందిని నియమించాలని, ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ నిరాహార దీక్ష చేస్తున్నట్లు వారు వివరించారు. మండల ప్రజలు పార్టీలకతీతంగా నాయకులు ప్రజాప్రతినిధులు, యువజన మహిళా సంఘాల సభ్యులు తమ దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించాలని వారు కోరారు.

## అప్రమత్తత-సైబర్ భద్రతకు ఏకైక మార్గం

**ఘట్‌కేసర్, ఆగష్టు 5, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్‌లోని ఏసీఈ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజువర్మ, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామిలు విద్యార్థులకు సైబర్‌నేరాల నివారణకు తీసుకోవాల్సిన విషయాలపై తెలియజేశారు. ఎదులాబాద్ సమీపంలోని జెబిఐఇ కళాశాలలో, ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ మహిళా కళాశాలలో, ఎన్ఎఫ్‌సీనగర్ సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ హాలులో, అవుషాపూర్‌లో ఘట్‌కేసర్ ఎస్ఐ షేక్‌హీనాలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైబర్ నేరాల నివారణకు గాను ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాజువర్మ మాట్లాడుతూ మీ బ్యాంక్ ఖాతా ఓటిపి, ఎటిఎం పిన్, క్రెడిట్/డెబిట్ కార్డ్ వివరాలు, యుపిఐ పిన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. బ్యాంక్ అధికారులు ఎప్పుడూ ఫోన్ చేసి ఈవివరాలు అడగరని మోసపూరిత లింకులు, వాట్సాప్, ఎస్ఎంఎస్, ఈమెయిల్‌లలో వచ్చే తెలియని లింక్‌లను (ఉదాహరణకు: లాటరీ గెలుచుకున్నారు, కరెంట్ బిల్లు చెల్లించకపోతే పవర్ కట్ అవుతుంది, పార్సెల్ నిలిచిపోయింది) క్లిక్ చేయవద్దని తెలిపారు. సీబీఐ, ఈడీ, పోలీసులమని చెప్పి ఫోన్ చేసి "మీ పేరు మీద డ్రగ్స్ పార్సెల్ వచ్చింది" అని బెదిరిస్తే భయపడవద్దని డిజిటల్ అరెస్ట్ అనే విధానం చట్టంలో లేదని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని సోషల్ మీడియాలో వచ్చే వర్క్ ఫ్రమ్ హోమ్/ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలను నమ్మవద్దని తెలిపారు. అనుమతి లేని అనధికార లోన్ యాప్‌ల నుండి రుణాలు తీసుకుని వేధింపులకు గురికావద్దని, సైబర్ మోసానికి గురైతే మొదటి 1 గంట అత్యంత కీలకమైనదని వెంటనే స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బును హోల్డ్ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలనిఆన్‌లైన్ పోర్టల్ వెంటనే నమోదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వెంటనే సంప్రదించి సమాచారం ఇవ్వాలని సూచించారు.